కిక్కిరిసిన ఉర్సు

- షరీఫ్ పీర్‌గైబ్ సాహెబ్ దర్గా ఉర్సులో పశువుల సంత
- వివిధ జాతులను తీసుకొచ్చిన యజమానులు
- రూ. 50 వేల నుంచి 4లక్షల వరకు ధర
- పెద్ద ఎత్తున తరలివచ్చిన ప్రజలు


పశుపోషకులకు బహుమతులు అందజేస్తున్న ఉమ్మడి జిల్లా సహకార సంఘం చైర్మన్ శివకుమార్

న్యాల్‌కల్, ఫిబ్రవరి 18: ఉర్సె షరీఫ్ పీర్‌గైబ్ సాహెబ్ దర్గా ప్రాంతం కిక్కిరిసిపోయింది. న్యాల్‌కల్ మండల కేంద్రం శివారులో ఏడాదికి ఒకసారి నిర్వహించే పశువుల జాతరలో పాల్గొనేందుకు వివిధ ప్రాంతాల నుంచి యజమానులు వేలాదిగా పశువులను తీసుకొచ్చారు. దర్గా ఉత్సవాల్లో భాగంగా ఆదివారం జరిగిన అంగడికి తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి రైతులు, వ్యాపారులు ప్రత్యేక వాహనాల్లో పశువులను రంగురంగుల రిబ్బన్లతో అందంగా అలంకరించుకొని తీసుకువచ్చారు.

జత ఎడ్లకు రూ.2.35 లక్షలు

సంతలో దియోనీ, ఒంగోలు, కిల్లరి తదితర జాతులకు చెందిన ఎడ్లు, కోడెదూడలు, ఆవులు, పాడిగేదెలు రాగా, వీటి ధరలు సుమారు రూ.50 వేల నుంచి 4లక్షల వరకు పలికాయి. మునిపల్లి మండలం గొర్రెగట్టుకు చెందిన మహిపాల్ రెండు ఎడ్ల జతను రూ. 2.35 లక్షలు, కోహీర్‌కు చెందిన రైతు మోహీల్ ఒక ఎడ్డును రూ.1.65 లక్షలు, కర్ణాటక సేర్సికి చెందిన రైతు సురప్ప ఒక ఎడ్డును రూ. 1.40 లక్షలకు కొనుగోలు చేశారు. కాగా, సంత, ఇక్కడికి వచ్చే అనేక జాతుల పశువులను చూసేందుకు వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు, రైతులు భారీగా తరలివచ్చి ఆసక్తిగా తిలకించారు. సెల్‌ఫోన్‌లో సెల్ఫీలు, ఫొటోలు తీసుకొని సందడి చేశారు.

భక్తుల సందడి

కులమతాలకతీతంగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలిరావడంతో పీర్ గైబ్ సాహెబ్ దర్గా పరిసరాలు సందడిగా మారాయి. ఎవరికీ ఇబ్బందులు రాకుండా ఉర్సు నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. జహీరాబాద్ రూరల్ సీఐ వెంకటేశ్ ఆధ్వర్యం లో హద్నూర ఎస్సై వినయ్‌కుమార్ పోలీ సు బందోబస్తు కల్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ మహ్మద్ తన్వీర్‌తో పాటు పలు పార్టీలకు చెందిన నాయకులు వెంకటేశం, సతీశ్ కులకర్ణి, ఏక్‌నాథ్‌పాటిల్, శివరాజ్ శిల్పకారుడు డాక్టర్ బస్వరాజ్, జాతర నిర్వాహకుడు యూనుస్‌ఖాన్, నర్సింహులు, మక్సూద్ పాల్గొన్నారు.

పశుసంపదను కాపాడుకోవాలి

రోజురోజుకూ కనుమరుగవుతున్న పశుసంపదను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఉమ్మడి మెదక్ జిల్లా సహకార సం ఘం చైర్మన్ ఈదుల పల్లి శివకుమార్ అన్నారు. దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉర్సులో భాగంగా ఉత్తమ పశుపోషకులైన రైతులు, యజమానులకు గ్రామానికి చెందిన దివంగత అడివప్ప, గిరిజమ్మ జ్ఞాపకార్థం బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ పశుసంపద తగ్గిపోతుండడంతో వ్యవసాయ పనులన్నీ యంత్రాలతో చేసుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని, ఎన్నో రకాల జాతుల పశువులు ఇక్కడికి వచ్చాయని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉన్నదన్నారు.

న్యాల్‌కల్ ఉర్సు ఉత్సవాల్లో ఏర్పాటు చేసిన సంతకు భారీగా వచ్చిన పశువులు

రూ. 2.35లక్షలకు ఎడ్ల జతను కొనుగోలు చేసిన గొర్రెగట్టుకు చెందిన రైతు మహిపాల్

ఒకేరోజు పది షాపుల్లో దొంగతనం

జహీరాబాద్, ఫిబ్రవరి 18: జహీరాబాద్ పట్టణంలో అర్ధరాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. 10షాపుల షెట్టర్లను పగులగొట్టి నగదు ఎత్తుకెళ్లారు. ఆదివారం తెల్లవారుజామున వైన్ షాపులు, బట్టల షాపులు, కిరణ షాపులు, ఇండ్లలో దొంగతనం చేశారని బాధితులు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితులు తెలిపిన ప్రకారం.. జహీరాబాద్–అల్గోల్ రోడ్డులో ఉన్న వైన్ షాపు, బీదర్ చౌరస్తాలో ఉన్న వైన్ షాపు, పాత సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు రోడ్డులో బట్టల షాపులు, సుభాశ్‌గంజ్‌లో ఉన్న షాపులో దొంగతనం జరిగింది. ఒకేరోజు పది షాపుల్లో దొంగతనం జరగడంతో వ్యాపారులు, పట్టణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

వైన్ షాపుల్లో మద్యాన్ని తీసుకుపోలేదని, నగదును మాత్రమే తీసుకెళ్లారని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బట్టల షాపులో నగదును ఎత్తుకెళ్లారని, ముగ్గురు దొంగలు షెట్టర్ లోపలికి వెళ్లడం సీసీ కెమెరాలో రికార్డు అయిందని తెలిపారు. నిందితులు ఎవరికీ అనుమానం రాకుండా బ్యాగు లు వేసుకొని ఉద్యోగానికి వెళ్తున్నట్లు సీసీ కెమెరాల పుటేజీలో రికార్డు అయింది. దొంగతనం జరిగిన షాపులను పోలీసులు పరిశీలించి వివరాలు సేకరించారు.

జహీరాబాద్ పట్టణంలో బట్టల షాప్ షెట్టర్ పగులగొట్టిన దొంగలు

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

ఝరాసంగం, ఫిబ్రవరి 18: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మండల పరిధిలోని బర్దీపూర్ గ్రామానికి మంజూరైన రూ.8 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వేణుగోపాల్ రెడ్డి గ్రామస్తులతో కలిసి ఆదివారం ప్రారంభించారు. మండలంలోని 33 గ్రామ పంచాయతీలకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.1.60 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ముందుకు వెళ్తున్నదని తెలిపారు. కార్యక్రమంలో కోట ఆశన్న, సిద్దు పాటిల్, కోట వెంకన్న, ఉస్మాన్, మల్లయ్య స్వామి, మహిపాల్ పాల్గొన్నారు.

బర్దీపూర్‌లో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న వేణుగోపాల్ రెడ్డి

కంకర క్రషర్లను నిలిపివేయాలి

జిన్నారం, ఫిబ్రవరి 18: మాదారం పంచాయతీ పరిధిలోని కంకర క్రషర్లను నిలిపివేయాలని గ్రామస్తులు ఆదివారం ఆందోళన చేపట్టారు. 'సేవ్ మాదారం' పేరుతో గ్రామ యువకులు విజయ్‌గౌడ్, సుదర్శన్, అంబదాసు, రమణసింగ్, గణేశ్, వెంకటేశంగౌడ్, చంద్రశేఖర్, రమేశ్, శ్రీనివాస్, సంతోశ్ తదితరులు కలిసి రాక్‌స్కాండ్ కంకర క్రషర్ పరిశ్రమ వద్ద ధర్నా నిర్వహించారు. నిబంధనలను పట్టించుకోకుండా విచ్చలవిడిగా బ్లాస్టింగ్ జరుపుతూ మాదారం ప్రజల జీవితాలను కబలిస్తున్నారని ఆరోపించారు. పేలుళ్లు భారీ స్థాయిలో జరుపుతున్నారని, ఇదేంటని క్రషర్ ప్రతినిధులను ప్రశ్నిస్తే ఒక్కొక్కరు ఒక్కోలా సమాధానం చెబుతూ తప్పించుకుంటున్నారని మండిపడ్డారు. పంచాయతీలో ఎలాంటి ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండానే కొత్తగా క్వారీలకు అనుమతులు ఎలా వచ్చాయని అధికారులను ప్రశ్నించారు. నిబంధనలు పాటించకుండా, ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్న క్వారీలను నిలిపేయాలని మైనింగ్, పీసీబీ అధికారులకు పది రోజుల క్రితం ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. గ్రామస్తుల ప్రాణాలను కాపాడేందుకు కలెక్టర్ మాదారం గ్రామాన్ని, చుట్టు పక్కల ప్రాంతాలను పరిశీలించాలని కోరారు. కంకర క్వారీలను టాస్క్ ఫోర్స్ కమిటీతో తనిఖీలు చేయించాలన్నారు. కార్యక్రమంలో పాండు, సంపత్, నరేశ్, ఆనంద్, బాలేశ్, చంటిగౌడ్ పాల్గొన్నారు.


రాక్‌స్కాండ్ కంకర క్వాలీ వద్ద ధర్నా చేస్తున్న మాదారం గ్రామస్తులు

సర్కార్ దవాఖానలో రక్తదాన శిబిరం

నారాయణఖేడ్, ఫిబ్రవరి 18: ఆరోగ్యవంతమైన దేశ నిర్మాణమే లక్ష్యంగా అత్యవసరంలో ఉన్న వారిని కాపాడడానికి రక్తం ఎంతో ఉపయోగపడుతుందని శ్రీసాంప్రదాయం జిల్లా నిరీక్షకుడు అశోక్ అన్నారు. ఆదివారం నారాయణఖేడ్ ప్రభుత్వ వైద్యశాలలో జగద్గురు నరేంద్ర ఆచార్య ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధ్యాత్మికంతోపాటు సామాజిక సేవలో నిరంతరం శ్రీసాంప్రదాయం కృషి చేస్తుందన్నారు. గతేడాది వందమంది రక్తదానం చేయగా ఈసారి కూడా రక్తదాన శిబిరం నిర్వహించామన్నారు.

కార్యక్రమం లో శ్రీసాంప్రదాయం కార్యకర్తలు రజిని, చంద్రశేఖర్, నరేష్‌యాదవ్, నగేష్‌సేట్, దేవదాస్, బస్వరాజ్, సంతోష్‌కుమార్, అశోక్, రాజు, వైద్య సిబ్బంది రాజేశ్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో సమస్య దూరం

రామచంద్రాపురం, ఫిబ్రవరి 18: ఆర్సీపురం డివిజన్‌లోని శ్రీసాయినగర్‌కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ని ఆదివారం కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పానగేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల బస్తీదర్శన్‌లో భాగంగా కాలనీలో పర్యటించినప్పుడు కాలనీవాసులు ట్రాన్స్‌ఫార్మర్ సమస్యను తమ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. సమస్యను విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ని ఏర్పాటు చేయించినట్లు చెప్పారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు శంకర్‌యాదవ్, రాజ్‌కుమార్, ప్రకాశ్, గోవర్ధన్‌రెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.


ట్రాన్స్‌ఫార్మర్‌ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ పుష్పానగేశ్

ప్రశాంతంగా ఎక్సలెన్స్ ఎంట్రెన్స్ ఎగ్జామ్

జిన్నారం, ఫిబ్రవరి 18: జిన్నారంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఎక్సలెన్స్ ఎంట్రెన్స్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మొత్తం 173 మంది విద్యార్థులకు 169 మంది ఎంట్రెన్స్ ఎగ్జామ్ రాసినట్లు ప్రిన్సిపాల్ మధుసూదన్ రెడ్డి తెలిపారు. పరీక్షలను పర్యవేక్షించారు. నలుగురు గైర్హాజరు అయ్యారని తలిపారు. 75 మంది బాలికలు, 94 మంది బాలురు పరీక్షలు రాసినట్లు వివరించారు.

విద్యార్థినితో అసభ్య ప్రవర్తన

ప్రిన్సిపాల్ రిమాండ్

పుల్కల్, ఫిబ్రవరి 18: విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఓ ప్రైవేటు పాఠశాల ప్రిన్సిపాల్ కటకటాలపాలయ్యాడు. ఈ ఘటన మండల కేంద్రంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. పుల్కల్ మండల కేంద్రంలో కొన్నేండ్లుగా సంగారెడ్డికి చెందిన షేక్ అహమ్మద్ సర్ వైస్ రాయ్ పేరుతో ఓ పాఠశాలను నిర్వహిస్తున్నాడు. ఏడో తరగతి వరకే పర్మిషన్ ఉన్నా గుట్టుచప్పుడు కాకుండా పదో తరగతి విద్యార్థులకు ప్రైవేటుగా పాఠాలు బోధిస్తున్నారు. నాలుగు రోజుల క్రితం పదో తరగతి విద్యార్థినిని ఇంటి దగ్గర దింపుతానని మాయమాటలు చెప్పి కారులో ఎక్కించుకున్నాడు. కారులో ప్రిన్సిపాల్ అసభ్యంగా ప్రవర్తించాడని విద్యార్థిని ఘటన జరిగిన మూడు రోజుల తర్వాత తల్లిదండ్రులతో చెప్పింది. ఈ విషయమై తల్లిదండ్రులు శనివారం ఎంఈఓ అంజయ్య, స్థానిక ఎస్ఐ శ్రీకాంత్ దృష్టికి తీసుకువెళ్లగా విచారణ చేపట్టారు. లైంగిక వేధింపుల కేసులో ప్రిన్సిపాల్ షేక్ అహమ్మద్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. పాఠశాలలో పర్మిషన్‌కు మించి తరగతులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని ఎంఈవో తెలిపారు.

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం

పుల్కల్, ఫిబ్రవరి 18: క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతాయని బీఆర్ఎస్ నాయకులు పుల్లయ్యగారి సుభాష్, మాజీ సర్పంచ్ సతీశ్ అన్నారు. మండల పరిధిలోని పెద్దారెడ్డిపేటలో అండర్ 14కబడ్డీ పోటీలు నిర్వహించారు. గ్రామానికి చెందిన ఐదు టీంలు పాల్గొనగా, ప్రథమ స్థానంలో ఫ్రెండ్స్ టీం, ద్వితీయ స్థానంలో హనుమాన్ టీం నిలిచింది. విజేత జట్లకు గ్రూప్ బహుమతులు అందజేశారు. పీఏసీఎస్ డైరెక్టర్ మల్లేశం, ప్రకాశ్, సురేశ్, ప్రవీ ణ్, ఆనంద్, శివచందర్, సాబేర్, అశోక్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కల్హేర్, ఫిబ్రవరి 18: మండలంలో పత్రికా జర్నలిస్ట్ నీరుడు ప్రవీణ్ తండ్రి ఇమ్మయ్య అకాల మృతి చెందడంతో నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మండలంలోని మిర్కాన్‌పేట్ గ్రామానికి వెళ్లి మృతికి గల కారణాలు తెలుసుకొని సానుభూతి తెలిపారు. ఆయనవెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాంసింగ్, మాజీ సర్పంచ్ కిష్టారెడ్డి, నాయకులు అంజయ్య సాగర్ ఉన్నారు.

కానిస్టేబుల్‌కు సన్మానం

కల్హేర్ మండలం ఇంద్రనగర్ తండాకు చెందిన దారవత్ రాజేశ్ సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగం సాధించిన నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే అతడిని సన్మానించారు.

మన భద్రత మన చేతుల్లోనే

చిత్రలేఖనం పోటీల్లో వేసిన చిత్రలేఖనాలను చూపిస్తున్న విద్యార్థులు

రామచంద్రాపురం, ఫిబ్రవరి 18 : భద్రతా చర్యలపై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలని జాతీయ భద్రతామండలి చైర్మన్ రాజగోపాల్ రావు అన్నారు. 53వ జాతీయ భద్రతా దినోత్సవం సందర్భంగా భెల్ కమ్యూనిటీ సెంటర్‌లో మహిళలకు గృహ భద్రతపై వ్యాసరచన పోటీలు, విద్యార్థులకు రోడ్డు భద్రత, ఆరోగ్యంపై చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 52మంది మహిళలతోపాటు ఎనిమిది పాఠశాలల నుంచి 500మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజగోపాల్‌రావు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ భద్రతా చర్యలను, పాటించాల్సిన నియమాలను తెలుసుకోవాలన్నారు. రోడ్డుపై ప్రయాణం చేస్తునప్పుడు రోడ్డు భద్రతా నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు జరగకుండా సురక్షితంగా ఉంటామన్నారు. పరిశ్రమల్లో భద్రతా చర్యలు తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ప్రవీణ్, వెంకన్న, భెల్ జీఎం హెచ్ఆర్ శ్రీనివాస్‌రావు, జీఎం విజయసాగర్, డీజీఎం అరవిందకుమార్, సత్యబాబు, మాయబ్రహ్మం, వెంకటేశ్వర్‌రావు, పరశురాం, బాలకృష్ణ, శ్రీకాంత్, మోహన్‌రావు, హరీశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

హరీశ్‌రావును కలిసిన బీఆర్ఎస్ నేతలు

బొల్లారం, ఫిబ్రవరి 18: బొల్లారం మున్సిపల్ బీఆర్ఎస్ నాయకులు, మాజీ జడ్పీటీసీ కోలన్ బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు ఆదివారం నగరంలో జరిగిన ఓ కార్యక్రమంలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలో చేపడుతున్న అభివృద్ధి పనులను హరీశ్‌రావుకు వివరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బీరప్పయాదవ్, మాజీ ఎంపీటీసీ యాదగిరిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

హరీశ్‌రావుతో బీఆర్ఎస్ నాయకులు

పునరుద్ధరణకు నోచుకునేనా?

కొత్తూర్(బి) గ్రామంలో ఉన్న అప్పటి నిజాం షుగర్ ఫ్యాక్టరీ, ప్రస్తుతం ట్రైడెంట్ ఫ్యాక్టరీ

- ఎన్నికల ముందు నిజాం షుగర్ ఫ్యాక్టరీపై కాంగ్రెస్ హామీ
- కమిటీ ఏర్పాటు, రెండు నెలల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశం
- ట్రైడెంట్ చేతుల్లో కర్మాగారం.. నష్టాల పేరుతో లేఆఫ్
- రైతులకు రూ. 9 కోట్ల పెండింగ్ బిల్లులు
- వేతనాలు అందక ఫ్యాక్టరీ కార్మికులు, ఉద్యోగుల వెతలు

జహీరాబాద్, ఫిబ్రవరి 18: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నిజాం షుగర్ ఫ్యాక్టరీ పరిధిలో జహీరాబాద్‌కు అధికంగా చెరుకు సాగు చేసే ప్రాంతంగా పేరుంది. 2002లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఫ్యాక్టరీని ప్రైవేటీకరించింది. ఫ్యాక్టరీలో ప్రభుత్వ వాటా లేదు. జహీరాబాద్ మండలంలోని కొత్తూర్(బి) గ్రామంలో 1972–73 లో నిజాం షుగర్ ఫ్యాక్టరీని 110 ఎకరాల్లో ఏర్పాటు చేశారు. ఫ్యాక్టరీని ప్రైవేటీకరించడం తో యాజమాన్యం తన పరిధిలో ఉన్న భూ ములను అమ్ముకున్నది. కార్మాగారంలో రెం డేండ్లుగా సరిగా క్రషింగ్ జరగడం లేదు. ఫ్యాక్టరీకి చెరుకు సరఫరా చేసిన రైతులకు రూ.9 కోట్ల బిల్లులు చెల్లించాల్సి ఉంది. రైతులకు పెండింగ్ బిల్లులు ఇప్పించేందుకు అప్పట్లో కేసీఆర్ ప్రభుత్వం రెవెన్యూ చట్టం ఉపయోగించింది. దీంతో యాజమాన్యం హైకోర్టుకు వెళ్లింది. రెండేండ్లుగా చెరుకును రైతులు కర్ణాటక, మహారాష్ట్రతోపాటు తెలంగాణలోని పలు ఫ్యాక్టరీలకు తరలించారు.

ఎన్నికల హామీ మేరకు కమిటీ ఏర్పాటు

తెలంగాణ కాంగ్రెస్ సర్కార్ శాసనసభ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు నిజాం షుగర్ ఫ్యాక్టరీని పునరుద్ధరించేందుకు కమిటీ వేసింది. అయితే యాజమాన్యం ఫ్యాక్టరీ పరిధిలోని భూములను అమ్ముకుంది. ప్రస్తుతం 20 ఎకరాల వరకు ఉంటుందని సమాచారం. లేఆఫ్ పేరుతో కంపెనీని ముసివేశారు. ప్రస్తుతం అందులో యంత్రాలు పని చేయడం లేదు. కర్మాగారాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని క్రషింగ్ చేసేందుకు అవకావం ఉంటుం దా? అమ్మిన భూములను తిరి గి స్వాదీనం చేసుకోవచ్చా, తదితర అంశాలపై స్థానికంగా చర్చలు మొదలయ్యాయి. ఫ్యాక్టరీని పునరుద్ధరిస్తారా.. లేదంటే మాటలకే పరిమితమవుతారా అన్న అంశాలపై చెరుకు రైతులు చర్చించుకుంటున్నారు.

రైతులు సాగు చేస్తున్న చెరుకు

జహీరాబాద్ ఎంవీఐ బదిలీ

జహీరాబాద్, ఫిబ్రవరి 18: ప్రభుత్వం జహీరాబాద్ పట్టణ రవాణా శాఖ అధికారి జయప్రకాశ్‌రెడ్డిని సూర్యాపేట ఎంవీఐగా బదిలీ చేసింది. హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో ఎంవీఐగా పని చేస్తున్న సురేందర్ రెడ్డిని జహీరాబాద్ యూనిట్ ఆఫీసుకు బదిలీ చేశారు. 65వ జాతీయ రహదారిపై రవాణా శాఖ చెక్‌పోస్టులో ఇన్‌చార్జిగా పనిచేస్తున్న శ్రీనివాస్‌గౌడ్‌ను జనగామ రవాణా శాఖ కార్యాలయానికి బదిలీ చేశారు. హైదరాబాద్‌లో పనిచేస్తున్న రాజు రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టుకు వస్తున్నట్లు అధికారులు తెలిపారు.

అధికారులకు జింక అప్పగింత

న్యాల్‌కల్, ఫిబ్రవరి 18: మండలంలోని హుస్సేల్లి గ్రామ శివారులో రోడ్డుదాటుతుండగా గాయపడిన జింకకు స్థానికులు చికిత్స అందించి అటవీ అధికారులకు అప్పగించారు. ఆదివారం గ్రామ శివారులోని అటవీ ప్రాంతం నుంచి బీదర్–జహీరాబాద్ ప్రధాన రోడ్డు దాటుతుండగా వాహనం తగిలి జింక గాయపడింది. విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి నాగభూషణం సిబ్బందితో కలిసి జింకకు వైద్య పరీక్షలు చేయించారు. అనంతరం అటవీ అధికారులకు సమాచారం అందించి జింకను అప్పగించారు.

గాయపడిన జింకకు చికిత్స చేస్తున్న పశువైద్యాధికారులు

కబడ్డీ పోటీలకు ఎంపిక

బొల్లారం, ఫిబ్రవరి 18: రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీల్లో బొల్లారం మున్సిపాలిటీలోని ఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థులు కీర్తి(8వ తరగతి), మేఘన (7వ తరగతి) అండర్–16 విభాగంలో పాల్గొంటున్నట్లు ప్రిన్సిపాల్ శైలజ, పీడీ శశిరేఖ తెలిపారు. ఈనెల 16, 17, 18, 19 తేదీల్లో సూర్యాపేట జిల్లా చింతలపాలెంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో వారు పాల్గొంటారని చెప్పారు. ఈనెల 8న జిల్లా స్థాయిలో జరిగిన ఎంపిక పోటీల్లో కీర్తి, మేఘన అత్యుత్తమ ప్రదర్శనతో రాష్ట్రస్థాయి కబడ్డీ జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

వైభవంగా ఉత్సవాలు

నారాయణఖేడ్, ఫిబ్రవరి 18: నారాయణఖేడ్ పట్టణంలోని శ్రీరామ మందిరంలో ఆదివారం మాధ్వ నవమి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఇందులోభాగంగా శ్రీరాముడికి అభిషేకం నిర్వహించి, మాధ్వ చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బ్రాహణ సంఘం బాధ్యులు, నర్సింహారావు, మలమంచి మోహన్ జ్యోషి, బొజ్జి రమేశ్ ఉన్నారు.

పూజలు చేస్తున్న బ్రాహ్మణులు

హన్మంత సేవపై ఆదినారాయణుడు

జిన్నారం, ఫిబ్రవరి 18: తెలంగాణ కంచిగా పేరుగాంచిన కొడకంచి ఆదినారాయణ స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదినారాయణ స్వామి శ్రీదేవి, భూదేవి సమేతంగా హన్మంత సేవపై కొడకంచి గ్రామ పురువీధుల్లో ఊరేగారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. హోమం, బలిహరణం నిర్వహించారు. ఆలయ ఫౌండర్, ట్రస్టీ చైర్మన్ రామాజీరావు ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి.

హన్మంత సేవపై ఆదినారాయణస్వామి

ఆలయ నిర్మాణానికి విరాళాలు

జిన్నారం, ఫిబ్రవరి 18: జిన్నారంలో నిర్మిస్తున్న జీవన జ్యోతిర్లింగ శివాలయానికి భక్తుల నుంచి విరాళాలు వస్తున్నాయి. గ్రామానికి చెందిన పల్నాటి భాస్కర్ రూ. 25 వేల సిమెంట్, హోటల్ విజయ్ రూ. 10, 116 నగదును ఆదివారం శివాలయ నిర్మాణ కమిటీకి అందజేశారు. ఆలయ నిర్మాణం వద్ద ఏర్పాటు చేసిన శివలింగాన్ని గ్రామస్తులు దర్శించుకొని పూజలు చేశారు.